క్లుప్తంగా

నవోదయ ప్రవేశ పరీక్షకు 22 మంది గైర్హాజరు

గండేపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు 22 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో 200 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 184 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు చెప్పారు. తాళ్లూరు హైస్కూల్ హెచ్ఎం పి.నాగమణి డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గానూ, గండేపల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు ఏవీఆర్ శర్మ చీఫ్ సూపరింటెండెంట్‌గానూ వ్యవహరించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించారు.

ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి సత్కారం



యశశ్రీని సత్కరిస్తున్న విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు

ఏలేశ్వరం: ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్ సాధించిన తూమురౌతు యశశ్రీని పట్టణంలో శనివారం సత్కరించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థిని యశశ్రీని మెమెంటో, మెడల్‌తో సత్కరించారు. పట్టణానికి చెందిన యశశ్రీ రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్ సాధించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో అలమండ పెదచలమయ్య, తూమురౌతు గురయ్య, కందుల ప్రభాకర్, ఏడీవీ ప్రసాద్, బాలి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వసతులు కల్పించాలి

కోటనందూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం హౌసింగ్ మండల ప్రత్యేకాధికారి పెద్దిరాజు అధ్యక్షతన రెవెన్యూ, ఉపాధి, మహిళా సమాఖ్య, విద్యుత్, ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో బోరుబావులు, విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఉన్న సమస్యలు పరిష్కరించి నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, హౌసింగ్ డీఈ వీఎస్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండె పోటుతో మాజీ మావోయిస్టు మృతి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచి గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు కందా నాగేశ్వరరావు శనివారం గుండె పోటుతో మృతి చెందాడు. ఆయన 1990లో పీపుల్స్ వార్ గ్రూప్‌లోని నాగులకొండ దళంలో మావోయిస్టుగా పనిచేశారు. అనంతరం ఆయన జన జీవన ప్రవంతిలోకి వచ్చారు. గతంలో ప్రత్తిపాడు జెడ్పీటీసీ అభ్యర్థిగా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తరఫున పోటీ చేశారు. ప్రస్తుతం ఆయన సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీలో పనిచేస్తున్నారు. ఆయన భౌతికకాయానికి వినోద్ మిశ్రా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు, విప్లవ కుమార్, శ్రీధర్ కన్నారావు, కందుల ప్రసాద్, ప్రముఖ న్యాయవాది చలంకూరి రామకృష్ణ తదితరులు నివాళులర్పించారు.

మహిళ మెడలో తాళిబొట్టు చోరీ

గండేపల్లి: మహిళ మెడలో తాళిబొట్టును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మురారి గ్రామ శివారు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న అంబటి బుల్లి వెంకట్రావు పాన్ షాపులో అతని భార్య గణికళ సామగ్రి అమ్ముతోంది. అదే సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వచ్చి ఆమెను షోడా బాటిల్ అడిగారు. బాటిల్ ఇస్తున్న సమయంలో ఆమె మెడలో ఉన్న మంగళసూత్రాలు కలిగిన మూడు కాసులు బంగారపు తాడును లాక్కునిపోయారు. దీనిపై ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రబీ ధాన్యం సేకరణపై అవగాహన

తొండంగి: గ్రామంలో రైతులకు రబీ ధాన్యం సేకరణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం రైతులు సాగు చేసిన ఎంటీయూ 1121, 1156 రకాల ధాన్యం సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మెషీన్‌తో కోత కోసిన ధాన్యంలో ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం తేమ శాతం తక్కువగా ఉండాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసిన రైతుల నుంచి ధాన్యం సేకరించి మద్దతు ధర చెల్లిస్తామన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో దైవప్రసాద్, గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

పచ్చదనం.. పర్యావరణ హితం

- ఉపాధిహామీ, సోషల్ ఫారెస్టు ఆధ్వర్యంలో మొక్కల పెంపకం
- ప్రజారోగ్యం, పర్యావరణానికి రక్షణ
- సత్ఫలితాలిస్తున్న ఎవెన్యూ, ఇనిస్టిట్యూట్ ప్లాంటేషన్



కోటనందూరు-పాతకొట్టాం రోడ్డులో ఆహ్లాదాన్ని పంచుతున్న మొక్కలు



జగన్నాథపురం-భీమవరపుకోట రోడ్డులో ప్రయాణికులకు నీడనిస్తున్న చెట్లు

కోటనందూరు: మానవ మనుగడకు ప్రమాదకారిగా మారిన వాతావరణ కాలుష్యాన్ని అదుపు చేస్తూ ప్రజారోగ్య పరిరక్షణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో విరివిగా మొక్కలు, అడవులను పెంచి ప్రకృతి ప్రియుల ప్రశంసలు అందుకుంటోంది. ఉపాధిహామీ, సోషల్ ఫారెస్టు ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కల పెంపకం సత్ఫలితాలను ఇస్తోంది. మొక్కలు చెట్లుగా మారి ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రోడ్లకు ఇరువైపులా పెరిగిన చెట్ల కింద చెట్ల కింద వాహనదారులు సేదతీరుతున్నారు. మొక్కల పెంపకాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చైతన్యంతో ప్రజల్లో మార్పు కనిపిస్తోంది.

మూడు నియోజకవర్గాల్లో 6 లక్షల మొక్కల పెంపకం

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో సోషల్ ఫారెస్టు ఆధ్వర్యంలో ఏటా సుమారు ఐదు లక్షలు, ఉపాధిహామీ పథకం ద్వారా లక్ష మొక్కల వరకూ ఎవెన్యూ, ఇనిస్టిట్యూట్, రైతుల ద్వారా మొక్కలు పెంచుతున్నారు. తుని నియోజకవర్గంలో గతేడాది సోషల్ ఫారెస్టు ఆధ్వర్యంలో ఎవెన్యూ, ఇనిస్టిట్యూట్ ప్లాంటేషన్ ద్వారా 1.5 లక్షల మొక్కలు, ఉపాధిహామీ పథకం ద్వారా 20 వేల మొక్కలు నాటారు. కోటనందూరు మండలంలోని టీజే నగరం-ఎస్సార్‌పేట, ఎస్సార్‌పేట-భీమవరపుకోట, కాకరాపల్లి-అల్లిపూడి, కోటనందూరు-కేపీ మల్లవరం, కోటనందూరు-పాతకొట్టాం, జగన్నాథపురం-భీమవరపుకోట రహదారుల్లో విస్తారంగా మొక్కలు నాటారు. సోషల్ ఫారెస్టు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూళ్లు, మండల పరిషత్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాల్లో విరివిగా మొక్కలు పెంచుతున్నారు.

మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం



పర్యావరణ, ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఇళ్లల్లో కూడా విరివిగా మొక్కలు పెంచే విధంగా ప్రజలను ప్రోత్సహిస్తున్నాం. మొక్కల పెంపకాన్ని ప్రజలంతా బాధ్యతగా తీసుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

– ఎస్.సుబ్రహ్మణ్యశర్మ, ఎంపీడీఓ, కోటనందూరు

మొక్కల సంరక్షణకు చర్యలు

ఉపాధిహామీ పథకం ద్వారా నాటిన ప్రతి 200 మొక్కలకు ఒక సంరక్షకుడు (వాచర్)ను ఏర్పాటు చేశారు. మొక్కలు ఎదిగే వరకూ చుట్టూ రక్షణ ఏర్పాటు, గాడి, కలుపు తీయడం, మొక్క చుట్టూ మంచి వాతావరణం కల్పించడం తదితర బాధ్యతలను అతనికే అప్పగిస్తారు. నీళ్లు పోసేందుకు మరొక వ్యక్తిని నియమిస్తారు. నెలకు నాలుగు పర్యాయాలు మొక్కలను నీరు పోసే బాధ్యతను అతనికి అప్పగిస్తారు. సోషల్ ఫారెస్టు ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు సైతం కూలీలను ఏర్పాటు చేసి సంరక్షిస్తారు.

రక్తహీనత నివారణపై శ్రద్ధ చూపాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

కిర్లంపూడి: గర్భిణుల్లో రక్తహీనత నివారణపై వైద్య సిబ్బంది శ్రద్ధ చూపాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, వలంటీర్ల సమక్షంలో ఎస్‌డీజీ సర్వే నిర్వహించారు. వీరవరం పీహెచ్‌సీ పరిధిలో రక్తహీనత సమస్యతో 19 మంది బాధపడుతున్నట్లు సర్వేలో నిర్ధారణ అయ్యింది. దీంతో వీరవరం పంచాయతీలో గర్భిణులకు శనివారం అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. రక్తహీనత లోపం ఉన్న గర్భిణులు వైద్యుల సూచనల మేరకు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ కేఎస్‌వీ ప్రసాదరావు, ఎంపీడీఓ బి.సతీష్‌బాబు, డాక్టర్ అరుణ, సర్పంచ్ అంబటి బుజ్జమ్మ, సచివాలయ కన్వీనర్ తోట విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: గ్రామాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని, దీనిలో భాగంగా మే 9 నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కోటికిపైగా గృహాలను సందర్శించినట్టు చెప్పారు. జగనన్నే మా భవిష్యత్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మే 9 నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కోటి 15 లక్షల మంది నుంచి వచ్చిన మిస్డ్ కాల్స్, ప్రశ్నావళికి సమాధానాలతో సరికొత్త ఆవిష్కరణలకు అవకాశం కలిగిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, సలహాలతో సంక్షేమ పథకాలను మరింత పారదర్శకంగా అన్ని వర్గాల వారికి అందించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు.

నియోజకవర్గంలో 90 శాతం

నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ద్వారా 90 శాతం గృహాలను సందర్శించామని తెలిపారు. గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు. సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, జగ్గంపేట మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.

దిగ్విజయంగా జగనన్నే మా భవిష్యత్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని ధర్మవరంలో జగనన్నే మా భవిష్యత్‌పై శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. పీపుల్స్ సర్వేలో భాగంగా నియోజకవర్గంలో 80,000 వేల కుటుంబాలను కలిసి మద్దతు కోరామన్నారు. సుమారు 70 వేల కుటుంబాలకు పైగా మిస్డ్ కాల్స్ ఇచ్చి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారన్నారు. వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నేతలు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్దిష్ట సమయం కన్నా ముందుగానే పూర్తి చేయడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్చార్జి రామిశెట్టి చినబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వ్యవసాయ సలహా మండలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దళే చిట్టిబాబు, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, ఏలేశ్వరం కౌన్సిలర్ అలమండ చలమయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, సొసైటీ చైర్మన్లు చక్కపల్లి సత్తిబాబు, గౌంతిన సురేష్, కొప్పన గంగారావు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గానికి సత్కారం



ప్రత్తిపాడులో మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించిన ఎంపీపీ తదితరులు

ప్రత్తిపాడు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ కోరారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ, వైస్ చైర్మన్ శేరు కృష్ణ, డైరెక్టర్లు గోళ్ల జయశేఖర్, సూరంపూడి నూకరాజు, రేఖా లక్ష్మిలను స్థానిక ఎంపీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కాంతి సుధాకర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి నూతన పాలకవర్గం కృషి చేయాలన్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దళే చిట్టిబాబు, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడు పత్రి రమణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఏడిద రెడ్డినాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల వీరబాబు, పినిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సూరిబాబుకు ఉగాది సేవా పురస్కారం



హెడ్ కానిస్టేబుల్ సూరిబాబును సత్కరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

తుని: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సూరిబాబుకు ఉగాది సేవా పురస్కారంలో లభించింది. కాకినాడ ఎస్పీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూరిబాబుకు ఉగాది సేవా పతకాన్ని అందించి ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో పారదర్శకంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. అవార్డు పొందిన సూరిబాబును తుని పట్టణ సీఐ నాగ దుర్గారావు, పోలీసు సిబ్బంది అభినందించారు.

మే డేను జయప్రదం చేయాలి

తుని: పట్టణంలో మే 1న నిర్వహించే ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ సీనియర్ నాయకుడు గొర్ల వెంకటరమణ పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ఆయన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణ, పీఎం నరేంద్ర మోదీ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మికులు గళమెత్తాలన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం మే డే వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సక్కెళ్ల శ్రీనివాస్, మున్సిపల్ కార్మికులు అప్పారావు, నూకరాజు, రవి, రాము, చిన్నారి, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రత్తిపాడు: సామాజిక సేవలో నర్సింగ్ విద్యార్థుల పాత్ర కీలకమని, ప్రతి విద్యార్థి మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకోవాలని ఏలేశ్వరం సీహెచ్‌సీ విశ్రాంత వైద్యాధికారి ఏవీ రమణ సూచించారు. స్థానిక ప్రశాంతి నర్సింగ్ స్కూల్ ఆవరణలో శుక్రవారం రాత్రి కేపింగ్ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగికి స్వాంతన చేకూర్చేది నర్సుల సేవలేనని అన్నారు. ప్రతి నర్సింగ్ విద్యార్థి రోగుల పట్ల సేవాభావంతో మెలగాలన్నారు. కిర్లంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రాంబాబునాయక్, విశ్రాంత గణాంకాధికారి గరిమెళ్ల సత్యనారాయణ, ఏవీ రమణ తదితరులు మొదటి సంవత్సరం నర్సింగ్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థినులను కేప్‌లతో అలంకరించారు. అనంతరం నర్సింగ్ మూడో సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. విద్యార్థినులు ప్రదర్శించిన జ్ఞానపద, సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కిర్లంపూడి యంగ్‌మెన్స్ క్లబ్ చైర్మన్ పెంటకోట నాగబాబు, కరస్పాండెంట్ ఎస్. మురళీకృష్ణ, డైరెక్టర్లు నండూరి శ్రీరామచంద్రమూర్తి (రాము), వై.శ్రీనివాసరావు, కిర్లంపూడి పీహెచ్‌సీ స్టాఫ్ నర్స్ ఎం.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తెల్లదోమ నివారణపై శిక్షణ

తుని రూరల్: కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్న తెల్లదోమల (రూగోజ్)ను రైతులు సమష్టిగా తరమికొట్టాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సునిత పిలుపునిచ్చారు. తుని మండలం తేటగుంట గ్రామంలో శనివారం ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో కొబ్బరి, ఆయిల్‌పామ్ రైతులు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఒకరోజు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం (వెంకట రామన్నగూడెం) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సునిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు, సిబ్బందితో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నష్టాలను అధిగమించాలంటే తెల్లదోమను సమూలంగా నివారించాలన్నారు. అందుకు రైతులు సమష్టిగా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. తెల్లదోమ లక్షణాలను సకాలంలో గుర్తించి, నివారించుకోవాలన్నారు. తెల్లదోమ నివారణకు 10 నుంచి 15 పసుపు రంగు జిగురు అట్టలను తూర్పువైపు ఉన్న చెట్ల వరుసకు అమర్చాలన్నారు. అధికారులతో కలసి సర్పంచ్ అత్తి నాగరాజు కొబ్బరి, ఆయిల్‌పామ్ రైతులకు నీమ నూనే పంపిణీ చేశారు.



తేటగుంటలో రైతులకు, ఉద్యాన సిబ్బందికి తెల్లదోమ నివారణపై శిక్షణ ఇస్తున్న అధికారులు

తెల్లదోమ నివారణపై రైతులకు శిక్షణ

తొండంగి: మండలంలోని గోపాలపట్నంలో రైతులు, ఉద్యానశాఖ సిబ్బందికి శనివారం కొబ్బరి, పామాయిల్ తోటల్లో తెల్లదోమ నివారణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ శాస్త్రవేత్త సునీత మాట్లాడుతూ కొబ్బరి, పామాయిల్ చెట్లకు సర్పిలాకారంలో తెల్లదోమ ఆశిస్తుందన్నారు. దీంతో ఆకుల అడుగు భాగాన తెల్లని మసి ఏర్పడతుందన్నారు. నివారణకు తూర్పువైపు చెట్లకు 10 నుంచి 15 పసుపురంగు అట్టలు ఏర్పాటు చేసి వేపనూనె పిచికారీ చేయాలన్నారు. ఉద్యానవనశాఖ అధికారి విజయలక్ష్మి, హార్టీకల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్

కోటనందూరు: స్థానిక సింహాద్రి కాలనీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం శనివారం ఉత్సాహంగా సాగింది. సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు మల్లంపల్లి ప్రకాష్, ఉలూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తామరాడలో..

కిర్లంపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. తామరాడలో వైఎస్సార్ సీపీ నాయకులు పెదిరెడ్డి లక్ష్మణ్, గంధం వీరబాబు, అడబాల శ్రీను, కన్వీనర్లు సెనాపతి లక్ష్మి, గంధం చక్రధర్,



తామరాడలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సూర్యకుమార్ తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ప్రభుత్వానికి మద్దతు పలికిన వారి ఇంటి గోడలకు సీఎం జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

గోకవరం: రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ సుంకర శ్రీవల్లీ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ధాన్యం గిట్టుబాటు ధరలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మండలస్థాయి అధికారులు, రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు. మండలంలో సుమారు 550 ఎకరాల్లో రైతులు 1156 రకం ధాన్యం సాగు చేశారన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోవడంతో క్వింటాల్‌కు 6 కేజీల నుంచి 20 కేజీల వరకూ ధాన్యం రేటు తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాస్ స్పందిస్తూ రైతులకు మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక అధికారిగా విజయ్ కుమార్‌ను నియమించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసిరి శ్రీరంగ, ఎంపీడీఓ మూర్తి, ఏఓ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, తోలేటి ప్రసాద్, నరాల శెట్టి సరసయ్య, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లీ

అకాల వర్షం



కిర్లంపూడిలో ధాన్యం రాసిపై గడ్డి కప్పుతున్న రైతు



జి.కొత్తపల్లిలో నేలకొరిగిన అరటి తోట

తొండంగి: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు శనివారం సాయంత్రం కురిసిన అకాలవర్షంతో సేదదీరారు. ఉదయం నుంచి ఎండ, ఉక్కబోత తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో సుమారు గంట సేపు భారీ వర్షం కురిసింది. వాతావరణం పూర్తిగా చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. వర్షానికి కళ్లాలపై ధాన్యరాసులు తడిసిపోయాయి. రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలులకు మెట్ట, తీరప్రాంతాల్లో మామిడి కాయలు నేల రాలాయి.

ప్రత్తిపాడులో వర్షం

ప్రత్తిపాడు: మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం 9 గంటలకే సూర్యభగవానుడు తన ప్రతాపం చూపాడు. మధ్యాహ్న సమయానికి 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం ఒక్కసారి వాతావరణంలో మార్పులు సంభవించాయి. ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో ఓమోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు మామిడి, జీడిమామిడి తోటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అకాల వర్షంతో పంటలకు నష్టం

శంఖవరం: మండలవ్యాప్తంగా శనివారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో అరటి తోటలు నేలకొరిగాయి. పలు చోట్ల మామిడి కాయలు రాలిపోయాయి. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అకాల వర్షానికి పలు గ్రామాల్లో కోసి పనలపై ఉన్న వరి పంట తడిసిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

కిర్లంపూడి: అకాల వర్షాలతో రైతులు సతమతమవుతున్నారు. మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం చిరు జల్లులు కురిశాయి. రైతులు పంట ఒబ్బిడి చేసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో కోసి పనలపై ఉన్న రబీ వరి పంట తడిసిపోయింది.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, మండలారాధన, అగ్ని ప్రతిష్ఠ, నిత్య పూర్ణాహుతి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం భేరిపూజ, బలిదానం, వాహన సేవ, తీర్థప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

1న స్వామివారి కల్యాణం

శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మే 1న ఉదయం శ్రీకృష్ణ గోపిక పూజ, సాయంత్రం ఏడు గంటలకు శ్రీనివాస దివ్య కల్యాణోత్సవం విశేషంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



శ్రీవారికి వాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

ఘనంగా ఏగులమ్మ తీర్థం

ప్రత్తిపాడు: గ్రామ దేవత ఏగులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు ఉన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్తిపాడులో ఏగులమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్